క్లుప్తంగా

వరసిద్ధుడి సేవలో ఎస్పీ మణికంఠ



ఎస్పీకి స్వామి ప్రసాదం అందజేస్తున్న ఈఓ పెంచల కిషోర్

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం ఎస్పీ మణికంఠ చందోలు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్‌నాయుడు, ఏఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో కర్ణాటక హోంమంత్రి



హోంశాఖ మంత్రిని కలిసిన వైఎస్సార్‌సీపీ చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయ స్వామిని మంగళవారం కర్ణాటక హోంశాఖ మంత్రి పరమేశ్వర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరితో పాటు కర్ణాటకకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారికి ఈఓ పెంచలకిషోర్ స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్ నాయుడు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన విజయానందరెడ్డి

కాణిపాకం దర్శనార్థం విచ్చేసిన కర్ణాటక రాష్ట్ర హోంశాఖ మంత్రిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువలతో సన్మానించారు. ఆయన వెంట బీసీ నాయకులు జ్ఞానజగదీష్ ఉన్నారు.

వైభవంగా ఆడిపూజలు



గుడిపాల: గంగమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

గుడిపాల: గంగమ్మ అమ్మవారికి మంగళవారం వైభవంగా ఆడిపూజలు నిర్వహించారు. అడవిచేను గ్రామంలో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అంబలి పోశారు. ఉపవాసాలతో అమ్మవారి వద్దకు వెళ్లి అభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణ చేశారు. అక్కడే సాయంత్రం పొంగళ్లు పెట్టి మంగళవాయిద్యాల నడుమ పూజలు చేశారు. మహిళలు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం గ్రామంలో సత్యమ్మ, మారెమ్మ అమ్మవార్ల తిరునాళ్ల జరుగుతుంది.

మనమిత్ర సేవలపై అవగాహన ర్యాలీ



గుడిపాల: పేయనపల్లెలో మనమిత్ర వాట్సాప్ సేవలపై ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది



గుడిపాల: వసంతాపురంలో మనమిత్ర వాట్సాప్ సేవలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అవగాహన ర్యాలీ

గుడిపాల: మనమిత్ర వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శిరీష తెలిపారు. మంగళవారం పేయనపల్లె, వసంతాపురం, పశుమంద గ్రామాల్లో మనమిత్ర వాట్సాప్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు మన మిత్ర సేవలు అందుబాటులో ఉంటుందన్నారు. ఏ సేవలు కావాలన్నా మొబైల్ ద్వారానే అందుకోవచ్చన్నారు. ప్రతి సమస్యను వాట్సాప్ ద్వారానే తెలియజేయవచ్చన్నారు. అనంతరం మనమిత్ర వాట్సాప్ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుందరేష్, మనోహర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏళ్ల కల.. సాకారమవుతున్న వేళ

ఎన్నో ఏళ్లుగా బహుదానదిపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్న 20 గ్రామాల ప్రజల సుదీర్ఘకాలం నాటి కల సాకారం కానుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.6 కోట్లు నిధులు సైతం మంజూరయ్యాయి. అయితే ఎన్నికలు రావడం.. ఆపై ప్రభుత్వం మారడం..టెండర్లు పిలవడంలో జాప్యం.. ఇతరత్రా కారణాలతో పనులు ఆలస్యం అయ్యాయి. ఇప్పుడు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- బహుదానదిలో బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం
- గత వైఎస్సార్‌సీపీ పాలనలోనే ప్రతిపాదనలు, రోడ్డు నిర్మాణం కూడా పూర్తి
- అప్పట్లోనే పీజీఎస్‌వై కింద రూ.6 కోట్ల నిధులు మంజూరు
- ప్రభుత్వం మారడంతో ఆలస్యమైన పనులు
- ఇటీవలే పునఃప్రారంభమైన బ్రిడ్జి పనులు
- పూర్తయితే 20 గ్రామాల ప్రజల రాకపోకలకు సౌకర్యం



ఎగువ తవణంపల్లె సమీపంలో బహుదానదిలో నిర్మాణ దశలో ఉన్న బ్రిడ్జి

తవణంపల్లె: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2023 సంవత్సరంలో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద అరగొండ–చిత్తూరు రోడ్డు నుంచి ఎగువ తవణంపల్లె మీదుగా కారకాంపల్లె వరకు తారు రోడ్డు నిర్మించారు. బహుదానదిలో వర్షం నీరు ఉధృతంగా ప్రవహిస్తే ప్రజల రాకపోకలు ఆగిపోయి జనజీవనం స్తంభించిపోతాయి. బహుదానదికి అవతల ఉన్న గ్రామాలకు మండల కేంద్రమైన తవణంపల్లెతో సంబంధాలు ఉండేవి కావు. ఈ నేపథ్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నాటి సీఎంగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకతను వివరించారు. ఈ ప్రతిపాదనకు నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుమతులు ఇచ్చారు. వెంటనే ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.6 కోట్లు నిధులు మంజూరు చేయించారు. బ్రిడ్జి నిర్మాణానికి బహుదానదిలో సాయిల్ టెస్టింగ్ పనులు, అంచనాలు, ప్రణాళిక తయారు చేయడం వంటివి ఆలస్యం అయ్యాయి. ఇప్పుడే పనులు ప్రారంభం అవుతున్నాయి.

20 గ్రామాల ప్రజలకు సౌకర్యం

గత ప్రభుత్వంలో ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జి నిర్మాణానికి 2023 సంవత్సరంలో ప్రతిపాదనలు పంపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికార యంత్రాంగం ప్రణాళికలు తయారు చేయడం, టెండర్లు ఖరారు చేయడం వంటి పనుల్లో జాప్యం జరిగింది. పీఎంజీఎస్‌వై పథకం కింద ఎగువ అరగొండ–చిత్తూరు ప్రధాన రహదారిలో ఎగువ తవణంపల్లె రోడ్డు నుంచి కారాకంపల్లె వరకు రోడ్డు నిర్మాణం పనులు రెండేళ్ల క్రితం పనులు చేపట్టి తారురోడ్డు పనులు పూర్తి చేశారు. బ్రిడ్జి నిర్మాణం పనుల్లో ఆలస్యమైనా.. అప్పటి ప్రతిపాదనలతో పీఎంజీఎస్‌వై కింద రూ.6 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఇందులో అంచనాల మేరకు బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.30 కోట్లు వ్యయంతో పనులు చేపట్టనున్నారు. జీఎస్టీ, క్వాలిటీ కంట్రోలు, డీపీఆర్ చార్జీలకు రూ.1.70 కోట్ల మేర ప్రభుత్వం బిల్లుల్లో కట్ చేస్తుంది. బహుదానదిలో బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతున్నాయి. పిల్లర్ దశలో ఉన్నాయి. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే 20 గ్రామాలకు పైగా రాకపోకలకు సౌకర్యం కలగనుంది. గత ప్రభుత్వంలో వేసిన బీజమే నేటికి వృక్షంలా కానుంది. కాగా కూటమి ప్రభుత్వం మాత్రం తామే పనులు చేస్తున్నామని డప్పు కొట్టుకుంటున్నారు.

మా కలలు సాకారమయ్యాయి



బహుదానది వాగుకు అవతల(ఉత్తరం దిశలో) ఉన్న గ్రామాలకు ప్రజలకు బ్రిడ్జి నిర్మించాలని చాలాకాలంగా కోరుకుంటున్నాం. గత ప్రభుత్వంలోనే తారురోడ్డు నిర్మించారు. ప్రస్తుతం బహుదానదిలో బ్రిడ్జి పనులు చేపట్టడంతో మా ప్రాంత ప్రజల కోరిక నెరవేరనుంది. – బి.దామోదరం, రైతు, కారకాంపల్లె

చాలాకాలంగా ఎదురు చూస్తున్నాం



బహుదానదిలో బ్రిడ్జి నిర్మించాలని చాలా కాలంగా ఎదురు చూస్తున్నాం. వర్షాకాలంలో బహుదానదిలో వర్షం నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. బహుదానదిలో వరద ప్రవాహం తగ్గే వరకు రాకపోకలు స్తంభించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జి పనులు ఎప్పుడు పూర్తి చేస్తారా ? అని ఎదురు చూస్తున్నాం.
– ఎస్. సుధాకర్ రెడ్డి, రైతు, ఎగువ తవణంపల్లె

20 గ్రామాలకు సౌకర్యం



ఎగువ తవణంపల్లె దగ్గర బహుదానదిలో బ్రిడ్జి నిర్మించడంతో మండలంలోని సుమారు 20 గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటోంది. గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో ఆలస్యమైనట్టు తెలిసింది. కానీ అధికారులు చొరవ చూపి పనులు చేపట్టడం సంతోషదాయకం.
– బి.రవీంద్ర రెడ్డి, రైతు, ఎగువ తవణంపల్లె

ఆర్నెళ్లలో పనులు పూర్తి చేస్తాం

ఎగువ తవణంపల్లె సమీపంలోని బహుదానదిలో పీఎంజీఎస్‌వై పథకం కింద రూ. 6 కోట్లు వ్యయంతో పనులు చేపడుతున్నాం. 2023వ సంవత్సరంలో నిధులు మంజూరైన డిపార్టుమెంటు చేయవలసిన పనులు పూర్తి చేసి పనులు చేపట్టాం. ఆరు నెలల్లో బ్రిడ్జి పనులు పూర్తి చేయిస్తాం.
– ఇ.నిరంజన్ రెడ్డి, ఏఈపీఐయూ

గ్రామాల్లో వైద్యసేవలు

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పైసా ఖర్చు లేకుండా, సమయం వృథా కాకుండా ఇంటి వద్దే వైద్యసేవలు అందుతున్నాయని గుడిపాల, బొమ్మసముద్రం డాక్టర్లు సంధ్య, రష్మిత అన్నారు. మంగళవారం గుడిపాల మండలంలోని కుప్పిగానిపల్లె గ్రామాల్లో వైద్యసేవలు అందజేశారు. ముందుగా శిబిరం ఏర్పాటు చేసి ఓపీ సేవలు అందించారు. ఈ సందర్భంగా 95 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపైన ఉన్న రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఎస్టీ జనాభా ఉన్న గ్రామాల్లో ఆస్తమా, ఉబ్బసం ఉన్న రోగులకు స్క్రీనింగ్, స్పిరోమెట్రి టెస్టలను ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు.

భారీ వర్షం..టమాటకు నష్టం



చౌడేపల్లె: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు టమాట, బీన్సు, కొత్తిమీర, వంకాయ తదితర తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు తోటల్లో నీరు నిండి వంకలు ప్రవహిస్తున్నాయి. అకాల వర్షం మేలు కంటే నష్టమే ఎక్కువ మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఆశాజనకంగా టమాట ధరలు ఉన్న తరుణంలోనే పంట దెబ్బతినడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. వర్షపునీటిని పొలాల నుంచి వెలుపలికి వెళ్లేలా చర్యలు చేపట్టారు.

తల్లిపాలు వ్యాధి నిరోధక టీకా లాంటివి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యబృందం

పూతలపట్టు(యాదమరి): తల్లిపాలు నవజాత శిశువుకు వ్యాధి నిరోధక టీకా లాంటివని మండల వైద్యాధికారి పూజిత అన్నారు. మంగళవారం జాతీయ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.హనుమంతరావు ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని.. ఆరు మాసాల వరకు శిశువుకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలు ఇవ్వని మహిళలు రొమ్ము కాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. నేటి కాలంలో చాలా మంది తల్లులు బిడ్డకు పాలిస్తే అందం తరిగిపోతుందనే ఉద్దేశంతో పాలు ఇవ్వడం మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీహెచ్ఓ లక్ష్మీనారాయణ, హెచ్ఈఓ నరసింహప్రసాద్, హెచ్ఎస్ నూర్జహాన్, ధర్మేంద్ర, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశా డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ఈ నెల వారం రోజుల పాటు జరిగే తల్లిపాల వారోత్సవాల్లో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి అంగన్‌వాడీ కేంద్రాల్లో విజయవంతంగా నిర్వహించాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు వివరించాలని సూచించారు. అదేవిధంగా ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవం గురించి వివరించారు. గ్రామాల్లో అంటువ్యాధుల ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓలు పీహెచ్ఎన్, ఆరోగ్య పర్యవేక్షకులు, టీబీ సూపర్‌వైజర్, ఎయిడ్స్, లెప్రసీ కంట్రోల్ అధికారి మణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: పిల్లలకు టీకాలు సకాలంలో వేయించాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. మంగళవారం ఆశావర్కర్లకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విటమిన్ ఏ సిరప్‌ను పిల్లలకు తొమ్మిదో నెలలో మొదటిసారిగా ఇవ్వాలన్నారు. అలాగే ప్రతి ఆరునెలలకు ఒకసారి అయిదేళ్ల పిల్లలు అయ్యేవరకు ఇస్తూ ఉండాలన్నారు. గర్భిణులుగా ఉన్న వారి వివరాలను 12 వారాల్లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతివారం గ్రామాల్లో వేస్తున్న టీకాల గురించి వారికి వివరించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లేటప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేవిధంగా చూసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఆగస్టు నెలలో తల్లిపాల వారోత్సవాలు ఉంటాయని వాటి గురించి తెలియజేయాలన్నారు. అలాగే నులిపురుగు నిర్మూలన దినోత్సవాన్ని జరపాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాల సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వరి సాగులో సస్యరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: వరి పంట సాగులో సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏఓ వరలక్ష్మి సూచించారు. మంగళవారం మండలంలోని చినకాంపల్లె ఆర్‌ఎస్‌కేలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతులకు వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓలు వరిసాగులో చీడపీడల వల్ల కలిగే నష్టాలు, వాటి సస్యరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. రైతులకు వచ్చే సందేహాలను నివృత్తి చేశారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి రైతు సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సాగు సస్యరక్షణ చర్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో ఆశావర్కర్ల పాత్ర కీలకం



మాట్లాడుతన్న వైద్యాధికారి రెడ్డెప్ప

ఐరాల: క్షేత్రస్థాయిలో ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాల అమలులో ఆశావర్కర్ల పాత్ర ముఖ్యమైందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డెప్ప మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లిపాల వారోత్సవాలు ఐసీడీఎస్, వైద్యసిబ్బంది సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించాలని చెప్పారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించడం ద్వారా రోగ నిరోధకశక్తి పెరగడంతో పాటు బిడ్డ ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందన్నారు. తల్లిపాలు పట్టించడం వల్ల కలిగే మేలు, డబ్బా పాలు పట్టడం వల్ల వచ్చే అనర్థాలు క్షేత్రస్థాయిలో గర్భిణులు, పాలిచ్చే బాలింతలకు అవగాహన కల్పించాలని ఆశావర్కర్లకు సూచించారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. అదేవిధంగా గర్భిణులకు ముందస్తు రిజిస్ట్రేషన్, 3, 6, 9 నెలల్లో వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి స్కానింగ్ పరీక్షలు చేయించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఘనంగా ఉరుసు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం పలమనేరు రోడ్డులోని దర్గాలో మంగళవారం ఉరుసు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. ఉరుసులో భాగంగా కన్నన్ కళాశాల రోడ్డు మార్గంలో పలు రకాల వస్తువులను అమ్మకానికి పెట్టారు. ప్రజల రాకతో ఆ ప్రాంతం సందడిగా కనిపించింది.

నూతన అక్రిడిటేషన్లకు కాలయాపన ఎందుకు?

- జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి
- కలెక్టరేట్ వద్ద జర్నలిస్టుల డిమాండ్స్ డే కార్యక్రమం
- జేసీ విద్యాధరికి వినతిపత్రం అందజేత

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా నూతన అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు కాలయాపన చేయడం ఎందుకో అర్థం అవ్వడం లేదని చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, కాశీశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఏపీయూడబ్ల్యూజే పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే కమిటీల ఆధ్వర్యంలో జర్నలిస్టుల డిమాండ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పాత అక్రిడిటేషన్‌ల గడువును ఇక పొడిగించకుండా కొత్త కార్డులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల్లో జర్నలిస్టుల యూనియన్‌లకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథం మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. విశ్రాంత జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధంగా పింఛన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నియంత్రణకు కలెక్టర్ నేతృత్వంలో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, రాష్ట్ర ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి శివకుమార్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు శివప్రసాద్, పవన్‌కుమార్, సీనియర్ జర్నలిస్టులు మహేష్, సురేష్, హరీష్, నవీన్, కృష్ణసింగ్, చంద్రప్రకాష్, చంద్రశేఖర్, శివ, శ్రీను పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించండి

కాణిపాకం: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం సన్నిధిలో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు జర్నలిస్టులు విన్నవించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ అక్రిడిటేషన్, ఇంటి స్థలాల మంజూరు, ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న జర్నలిస్టుల పెన్షన్ స్కీం అమలు చేయాలన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నివారించేందుకు నివారణ కమిటీని, ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

జీఓ నంబర్ 77 రద్దు చేయాలి



పలమనేరు ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గంతో జిల్లా నాయకులు


పలమనేరు: పీజీ విద్యను అభ్యసించడానికి డిగ్రీ విద్యార్థులకు అడ్డంకిగా మారిన జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు సంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తోందని విమర్శించారు. ఉన్నత విద్య గందరగోళంగా మారిందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ కారణంగా డిగ్రీ విద్యార్థులకు పీజీలో ఇక్కట్లు తప్పేలా లేవన్నారు. ఇక పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలమనేరు శాఖ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో భరత్, శిరీష, మౌనిక, వరలక్ష్మి, వినయ్, హరీష్, దివ్య, సమీనా తదితరులు పాల్గొన్నారు.


నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు డివిజన్లలో బుధవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక 36వ డివిజన్‌లోని ఎంజీఆర్‌వీధి వద్ద ఉదయం 10 గంటలకు, అనంతరం 43వ డివిజన్ రాములవారి గుడి వీధి గీతామందిరం వద్ద కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

● ఆకాశ లింగం..

గుడిపాల మండలంలో మంగళవారం సాయం సంధ్య వేళ ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. ఆ చిత్రాలను చూసి చూపరులు సైతం ఆశ్చర్య చకితులయ్యారు. అందులో ఒకచోట పరమశివుడే ఆకాశ లింగం రూపంలో దర్శనమిస్తే.. మరోచోట వింతాకారంలో ఉన్న ఓ వ్యక్తి ఆకాశాన్ని నోటితో మింగేస్తున్నట్లు కనిపించింది. ఆకాశంలో ఒకేసారి ఇలా రెండు విభిన్న బింబాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. – గుడిపాల





అధిక ఫీజుల వసూళ్లపై ఆందోళన



ఎన్నికైన నూతన ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను అరికట్టకపోతే ఆందోళనలు చేపడతామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని గంగినేనిచెరువు వద్ద సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు, ఇంజినీరింగ్ కళాశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడితే ఊరుకునేది లేదన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని చెప్పారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ కన్వీనర్‌గా మసూద్, కోకన్వీనర్ చాణక్య, కమిటీ సభ్యులుగా వెంకట్, దిలీప్, రఫీ, అభినేష్, కార్తీక్, డిల్లీప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.